క్లుప్తంగా

శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచు లక్ష్మీదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తరలించి విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవను చేపట్టారు.

గూడలి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోట: గూడలిలో కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వర్ణముఖి నదీ జలాలతో స్వామి వారిని అభిషేకించారు. తదుపరి పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, గ్రామోత్సవం నిర్వహించారు. తొలిరోజు కార్యక్రమాలకు గుంటక వెంకటరమణయ్య కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నవ ధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు

దక్కిలి: నవ ధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ప్రకృతి వ్యవసాయశాఖ ఎంటీ సుహర్లత తెలిపారు. ఆమె శనివారం లింగ సముద్రం యూనిట్‌లో నవ ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో 20 రకాల విత్తనాలను చల్లి పూత దశలో కలియ దున్నాలని తెలిపారు. తద్వారా భూమిలో జీవ పదార్థం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం రైతులకు అందించేందుకు 150 నవధాన్యాల కిట్లు తయారు చేశారు. కార్యక్రమంలో డీఎంటీ వేమ నారాయణ, ఎంసీఆర్పీ శేషం పెంచలయ్య, డీఎంటీ ప్రతిమ, సిబ్బంది రజని, కవిత, పారిజాతం, నాగేశ్వరి పాల్గొన్నారు.

టీఎమ్మార్ స్కూల్‌లో కాన్వొకేషన్ డే



జ్ఞాపికలు చూపుతున్న విద్యార్థులు

చిట్టమూరు : మండలంలోని కొత్తగుంటలో ఉన్న టీఎమ్మార్ స్కూల్‌లో శనివారం కాన్వొకేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్స్, మొమెంటోలు అందజేశారు. కరస్పాండెంట్ టి.మనోహర్ రెడ్డి, డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ యూనివర్సిటీల్లో ఇచ్చే పట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు కొనసాగుతున్న వైద్యం

చిల్లకూరు : నిల్వ ఉన్న బిరియాని తిని అస్వస్థతకు గురైన చిల్లకూరు సమీపంలోని డానియల్ చిల్డ్రన్ హోమ్‌కు చెందిన పిల్లలకు వైద్యం కొనసాగుతోంది. బిరియాని తిని 13 మంది చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ ఆదేశాల మేరకు వారిని గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు పీహెచ్‌సీ వైద్యులు జ్యోతి పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. వైద్యులు మాట్లాడుతూ పిల్లలు కోలుకున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

బాలకృష్ణారెడ్డి నేత్రాల దానం



బాల కృష్ణారెడ్డి(ఫైల్)

తడ: మండలంలోని గొల్లల ములువు గ్రామానికి చెందిన వేనాటి బాలకృష్ణారెడ్డి(93) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సూళ్లూరుపేట కు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సమితి ప్రతినిధులు నేత్ర దానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మరణించిన బాలకృష్ణారెడ్డి నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో వైద్యులు కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు.

రెండు నెలలకే దెబ్బతిన్న రోడ్డు



సైదాపురంలో ఇటీవల వేసిన రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడంతో అప్పుడే దెబ్బతింటోంది. కైవల్యానది వంతెన వద్ద నుంచి రాపూరు రహదారి వరకు రోడ్డు మరమ్మతులకు కలెక్టర్ ప్రత్యేకంగా మినరల్ గ్రాంట్ కింద రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించలేదు. దీంతో రెండు నెలలకే తారు పోయి కంకర తేలుతోంది. డీఈని వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశామని తెలిపారు. - సైదాపురం

శిథిలావస్థలో తరగతి గది



మండలంలోని చందనముడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న రేకుల గది శిథిలావస్థకు చేరింది. ఎప్పుడైనా కూలిపోవచ్చని, తొలగించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కూలిపోయి పిల్లలకు ప్రమాదం జరగకుండానే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - దొరవారిసత్రం

మందుబాబులకు నిలయం



మినమనముడిలోని చెత్త సంపద తయారీ కేంద్రం మందుబాబులకు నిలయంగా మారింది. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీ పాలకులు ఈ కేంద్రాన్ని నిర్మించి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. పిల్లర్లు, గోడలు దెబ్బతింటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. - దొరవారిసత్రం

బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్



చిల్లకూరు : పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ, తహసీల్దార్లు



నాయుడుపేట టౌన్ : జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య



వెంకటగిరి రూరల్ : జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ

దొరవారిసత్రం/దక్కిలి/రాపూరు/చిట్టమూరు/వెంకటగిరి రూరల్ : దొరవారిసత్రం, దక్కిలి, రాపూరు, చిట్టమూరు మండలాలు, వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, కమిషనర్ వెంకటరామిరెడ్డి, విప్ పి.లక్ష్మి, జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దొరవారిసత్రం, దక్కిలి తహసీల్దార్లు శైలకుమారి, మోపూరు శ్రీనివాసులు, దొరవారిసత్రం ఎంఈవో కృష్ణయ్య, ఎంపీడీవో గోవర్ధన, రాపూరు ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, చిట్టమూరు ఎంపీడీవో మనోహర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

చిల్లకూరు : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని గూడూరులో ఘనంగా జరుపుకున్నారు. టవర్ క్లాక్ ప్రాంతంలో నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్, ఏపీ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలు అభివృద్ధి చెందుతారని నమ్మి ఆచరణలో పెట్టిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ మాట్లాడుతూ దేశ నాయకులను గౌరవించడం మన బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం పేదలకు భోజనం ప్యాకెట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గూడూరు, చిల్లకూరు తహసీల్దార్లు చంద్రశేఖర్, శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆదూరు రత్నం, సుందరం యాలపల్లి శ్రీనివాసులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పూల మాల వేసి నివాళులర్పించారు.



రాపూరు : విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని సినిమా హాల్ సెంటర్‌లో బాబూజగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. అక్కడ 10 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 2 సెంట్లను విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ 2024లో తీర్మానం చేసింది. జిల్లా కలెక్టర్ అనుమతి కోసం పంపించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విగ్రహం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్, పోలీసులు అక్కడికి చేరుకుని విగ్రహం తొలగించాలని పట్టుబట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఆరి శంకరయ్య కోరారు.



దక్కిలిలో జగ్జీవన్‌రామ్‌కు అధికారుల నివాళి

ఆదర్శమూర్తి బాబూ జగ్జీవన్‌రామ్

నాయుడుపేట టౌన్ : బాబూ జగజ్జీవన్‌రామ్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసి ఆదర్శమూర్తిగా పేరుపొందారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేటలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాలతో పాటు వ్యవసాయ రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిన ఘనత జగ్జీవన్‌రామ్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ, మండలాల కన్వీనర్లు కలికి మాధవరెడ్డి, ఒట్టురు కిషోర్ యాదవ్, కటకం జయరామయ్య, బైనా మల్లికార్జున రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు పాలేటి నాగార్జున, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఈదా రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు. రాపూరు సిద్ధవరంలో భీమ్‌సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిరంజీవి విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు, స్వీట్లు అందజేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ గోను రాజశేఖర్

దక్కిలి: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ గోను రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా బోర్లు మరమ్మతులకు గురైనా, డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ పని చేయకపోయినా వెంటనే సరిచేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు సాగు చేసుకుంటున్న భూములకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో జీవో నెంబరు 30 అనుసరించి గయాలు, గ్రామ కంఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి నాగార్జునసాగర్, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు, ఏవో విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా హోమియో వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్ : మండలంలోని అయ్యప్పరెడ్డి పాళెం సమీపంలోని భగవతి మల్లికాంబ ఆలయం వద్ద ఆదివారం ఉచిత మెగా హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అమాస రామానారాయణ తెలిపారు. అదే విధంగా చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. మందులు, కంటి అద్దాలు అందజేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు అంకురార్పణ



బైక్ ర్యాలీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

చిట్టమూరు : మల్లాం గ్రామంలో వున్న రామసాయి మందిరంలో శనివారం ఉదయం శ్రీరామ నవమి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. గణపతి హోమం, కలశ స్థాపన పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవారి కల్యాణం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి గ్రామోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వీహెచ్‌పీ బైక్ ర్యాలీ

చిల్లకూరు : శ్రీరామ నవమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు కోరారు. వారు ప్రజలకు అవగాహన కల్పించడానికి శనివారం గూడూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గూడూరు రెండో పట్టణంలోని తిలక్ నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి ఒకటో పట్టణంలోని కోనేటి మిట్టలో ఉన్న కోదండరామస్వామి ఆలయం వరకు సాగింది. కోట సునీల్, మురళీరెడ్డి మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని చాటి చెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలక్రిష్ణమనాయుడు, మల్లికార్జున్, మనోజ్‌కుమార్, దయాకర్, వెంకటేశ్వర్లు, శ్రీమరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ నగదు పంపిణీలో జాప్యం

కలువాయి(సైదాపురం) : కల్లూరు సచివాలయం -2 జేఎల్ఎం వెంకటేశ్వర్లు వెంకటరెడ్డిపల్లిలో పింఛనుదారులకు ఐదో తేదీ వచ్చినా నగదు చెల్లించ లేదు. లబ్ధిదారులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు. వెంకటేశ్వర్లు వద్ద సుమారు రూ.80 వేలు పింఛను నగదు ఉన్నట్లు సచివాలయ అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నగదు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

8న సామాజిక తనిఖీ ప్రజావేదిక

తడ: మండలంలో గత ఏడాది ఉపాధి హామీ కింద చేసిన పనులపై సామాజిక తనిఖీలో వెలుగు చూసిన విషయాలపై 8న ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలో పలు శాఖల పరిధిలో చేసిన పనులు, ఖర్చు చేసిన మొత్తంపై మార్చి 5 నుంచి 17వ తేదీ వరకు తనిఖీలు చేసినట్టు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

వెంకటగిరి నుంచే కూటమి ప్రభుత్వ పతనం



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పరిపాలనను సాగిస్తోందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శనివారం వాకాడులోని తన నివాసంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి పీ–4 అంటూ మరో నాటకానికి తెరతీశాడన్నారు. ఈ నెల 9న జరిగే అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని, తద్వారా కూటమి ప్రభుత్వ పతనం మొదలవుతుందని జోస్యం చెప్పారు. త్వరలో జమిలి ఎన్నికలు రానున్నాయని, ప్రజలకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కస్తూర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, మధురెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవి, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

చిట్టమూరు : మండలంలోని తాడిమేడు చెరువు కట్ట వద్ద శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. వాకాడు మండలం బుర్లావారిపాళెంకు చెందిన వ్యక్తి బైక్‌లో సూళ్లూరుపేట నుంచి కోట వైపు వస్తున్నాడు. తాడిమేడు చెరువు కట్ట వద్ద తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అటువైపు వెళ్తున్న వారు గమనించి 108 ద్వారా వాకాడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వల్లే గాయపడి ఉంటాడని, అతని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

రాపూరు: మండలంలోని పులిగిలపాడు సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొంది. రాపూరు మండలం జోరేపల్లికి చెందిన వల్లూరు జగదీష్ బైక్‌లో జోరేపల్లి నుంచి రాపూరు వస్తున్నాడు. పులిగిలపాడు సమీపంలో రాపూరు నుంచి గూడూరు వైపు వెళుతున్న ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను 108లో రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం వైద్యులు అతన్ని గూడూరుకు పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాపూరు: గాయపడిన జగదీష్

అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న విజయభాస్కర్

గూడూరు రూరల్ : తుంగపాళెం గ్రామ సమీపంలో ఉన్న శ్రీనివాస మైన్స్‌లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని, అడ్డుకోవాలని మైనింగ్ భాగస్వామి తుమ్మతాటి విజయ భాస్కర్ కోరారు. ఆయన శనివారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను, మరికొందరు కలిసి 2013 నుంచి మైనింగ్ చేస్తున్నామని తెలిపారు. 2023లో తన సంతకాలు ఫోర్జరీ చేసి మైనింగ్‌ను ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నించిన తనను కులం పేరుతో దూషించి దిక్కున్న చోట చెప్పుకోవాలని బెదిరించారని వాపోయారు. కోర్టును ఆశ్రయించగా స్టే ఆర్డర్ ఇచ్చిందన్నారు. అయినా వారు అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్నారని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మైనింగ్ ఈడీతో మాట్లాడతామని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే తుమ్మతాటి విజయభాస్కర్ గూడూరు డీఎస్పీ గీతాకుమారికి వినతి పత్రం అందజేశారు.

రోడ్డు వేశారు.. వదిలేశారు



గొల్లపాళెం ఎస్టీ కాలనీలో రోడ్డు

దొరవారిసత్రం : మండలంలోని 22 పంచాయతీల్లో ఉపాధి నిధులు రూ.12.18 కోట్లతో 29 సీసీ రోడ్లు వేశారు. పనులు పూర్తి చేసిన తర్వాత ఇరువైపులా రోడ్డు దెబ్బతినకుండా సైడ్ బరమ్స్‌కి గ్రావెల్‌తో లేవలింగ్ చేయాలి. మండలంలో ఎక్కడా సీసీ రోడ్లకు ఇరువైపులా సైడ్ బరమ్స్‌కు గ్రావెల్ వేయలేదు. అలాగే వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా బోర్డులు కనిపించడంలేదు.

కండలేరులో 47.964 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 47.964 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



ప్రత్యేక ప్రార్థనల్లో జడ్జిలు







సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ప్రజలు

ముగిసిన ఉరుసు ఉత్సవం

నాయుడుపేటలోని హజరత్ అమీర్ షావలీ దర్గా ఉరుసు శనివారం రాత్రి ఘనంగా ముగిసింది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాయుడుపేట, సూళ్లూరుపేట జడ్జిలు పి.సంయుక్త, ఎస్.అనూష, ఎస్.అనీల్ దర్గాను దర్శించుకున్నారు. వారికి ఉరుసు నిర్వహణ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పాతేహాలు చేసి ఆశీర్వదించారు. – నాయుడుపేట టౌన్